క్లుప్తంగా

సానిగూడెం విచారణ మరింత అభివృద్ధి చెందాలి



నిత్యసహాయ మాత టవర్ ప్రారంభించిన ఫాదర్‌బాల

దెందులూరు: సానిగూడెం ఆర్‌సీఎం విచారణ మరింత అభివృద్ధి చెందాలని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. సానిగూడెం గ్రామంలో విచారణ కర్త ఫాదర్ జోస్ పాల్. సానిగూడెం ఆర్‌సీఎం సంఘ పెద్దలు, సంఘస్తులు, యువత ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్య సహాయ మాత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికార్ జనరల్ బాల మాట్లాడుతూ గ్రామంలో నిత్య సహాయ మాత టవర్ నిర్మాణం జరగటం సంతోషంగా ఉందన్నారు. సువార్త ప్రకటన విశ్వవ్యాప్తం కావాలని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం అవ్వాలని కోరారు. అనంతరం ఫాదర్లను సానిగూడెం గ్రామ పెద్దలు, సంఘస్తులు, యువత ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ

దెందులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో దెందులూరు మండలం అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం జోగన్నపాలెంలో 20 నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకి అనేక గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయన్నారు. ప్రాధాన్యత క్రమాన్ని బట్టి అన్ని గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

హైవేపై డివైడర్ ఏర్పాటు



హైవేపై ఏర్పాటు చేసిన డివైడర్

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొమిరేపల్లివద్ద డబుల్ రోడ్డులో డివైడర్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు డివైడర్ ఉన్నప్పటికీ దాన్ని తొలగించడంతో వాహనాలు రాంగ్ రూట్‌లో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు రావడంతో అనేక ప్రమాదాలు జగుతున్నాయి. దీనిపై స్పందించిన పోలీస్ శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ప్రమాదాల నివారణలో భాగంగా హైవే రోడ్‌లో డివైడర్ ఏర్పాటు చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంట గ్రామంలో వెలసిన శ్రీ రాట్నాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తులు మాత్రం పరిమి త సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీసేవారు. అయితే అమావాస్య కావడంతో భక్తుల తాకిడి తగ్గిందని దేవస్థాన నిర్వాహకులు చెప్పారు.

మానవత చేయూత

ఉంగుటూరు : కైకరం గ్రామానికి చెందిన చల్లా కృపా ఏంజెల్ అనే చార్టర్డ్ అకౌంటెన్సీ విద్యార్థినికి మానవత సంస్థ ప్రతినిధులు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. నారాయణపురంలో నిర్వహించిన మండల ప్రతినిధుల సమావేశంలో ఈ సొమ్ము అందించారు. సంస్థ మండల అధ్యక్షుడు వి.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థి నాగమణికంఠను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 592 మార్కులు సాధించిన భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థి రామిశెట్టి నాగమణికంఠను ఎమ్మెల్యే ధర్మరాజు దుశ్శాలువా కప్పి సత్కరించారు. పాఠశాలలోని 38 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా, 84 మంది 500 మార్కులకు పైగా సాధించడంపై ఆయన యాజమాన్యాన్ని అభినందించారు. ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన తరగతులకు వేదికలుగా..



భీమడోలు లైబ్రరీలో వేసవి విజ్ఞాన తరగతులపై అవగాహన కల్పిస్తున్న మండే సుధాకర్



పూళ్లలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

గ్రంథాలయాల్లో నేటినుంచి జూన్ 6వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు

భీమడోలు: వేసవి సెలవుల్లో చిన్నారులకు పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు వేదికలు కానున్నాయి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని శాఖల్లో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించారు. 10 నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. నిత్యం పాఠ్యపుస్తకాలతో కుస్తీ పడుతూ ఏడాదింతా కష్టపడిన విద్యార్థులకు పరీక్షల అనంతరం వేసవి విరామం లభించడంతో ఆనందానికి అవధులుండవు. సెలవుల్లో చిన్నారులకు విజ్ఞానదాయకమైన అంశాలను నేర్పించేందుకు గ్రంథాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆటలు, పాటలు, కథలు వినడం, చదవడం ఇలా విభిన్న అంశాలపై అయా గ్రంథాలయల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆయా అంశాల్లో అనుభవజ్ఞులైన రిసోర్స్ పర్సన్లతో పిల్లలకు తర్ఫీదును అందిస్తారు.

ప్రతి వారం చర్చా.. సమీక్ష

పఠనం, సరదా అనే విభాగాల్లో శిక్షణ ఉంటుంది. కథలు వినడం, చెప్పడం, గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి సమీక్షలు రాయడం, స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం, పేపర్ కాఫ్ట్స్, నృత్యం, చదరరంగం, కేరమ్స్ తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు. అయా కార్యక్రమాలపై ప్రతి వారం చర్చా సమీక్షలు నిర్వహిస్తారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని పలువురు చెబుతున్నారు.

శిక్షణ తరగతులు ఇలా..

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలో ఏడు శాఖా గ్రంథాలయాలున్నాయి. వాటిలో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు గ్రంథపాలకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక తరగతుల సమయం ఇలా

- ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు వినడం
- 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం
- 10 నుంచి 10.30 గంటలకు పుస్తక సమీక్ష
- 10.30 నుంచి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, నృత్యాలు, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణలు

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు వేసవి విరామంలో లైబ్రరీల్లో నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి. ఇంటి వద్ద సెల్ ఫోన్లు, టీవీలు చూస్తూ గాడి తప్పుతున్న చిన్నారులను పుస్తకాల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రతి విద్యార్థి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు తీసుకురావాలి.

– తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, గ్రంథాలయ అభివృద్ధి చైర్మన్, భీమడోలు

నేడు మహా కుంభాభిషేక మహోత్సవం

దెందులూరు: సత్యనారాయణపురంలోని శ్రీ సీతా రామా చంద్ర స్వామి మహా కుంభాభిషేకం మహోత్సవం సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు భక్త సమాజం తెలిపింది. మే 1వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామివారిని ఆశీస్సులు పొందాలని కోరింది.

నేటినుంచి రక్షణ సువార్త సభలు

దెందులూరు: జోగన్నపాలెంలోని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం నివాసంలో సోమవారం నుంచి రక్షణ సువార్త సభలు జరుగుతాయని మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేత నిట్టా గంగరాజు తెలిపారు. మూడు రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు సభలు ప్రారంభమవుతాయన్నారు. దెందులూరు సమీప మండలాల్లోని విశ్వాసులు రక్షణ సువార్త సభలకు హాజరై దేవుని దీవెనలు పొందాలని ఆయన కోరారు.

నేటినుంచి గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు

దెందులూరు: దెందులూరు, పోతునూరు గ్రంథాలయాల్లో సోమవారం నుంచి సమ్మర్ క్యాంపులు ప్రారంభమవుతాయని గ్రంథాలయ అధికారులు ఝాన్సీ, రాంబాబు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 11 గంటల వరకు ఈ క్యాంపులు జరుగుతాయన్నారు. వ్యాసరచన, క్విజ్, చదవడం, డ్రాయింగ్, పెయింటింగ్ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాలల విద్యార్థులు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారులు కోరారు.

సెలవుల సందడి



పొలాల్లో వాలీబాల్ ఆడుతున్న యువకులు



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేస్తున్నారు. యువతులు అంతర్గత పోటీలైన క్యారమ్స్, హౌసీ, అష్టాచమ్మ, తదితర ఆటలు ఆడుతుంటే, యువకులు ఖాళీ ప్రదేశాల్లో క్రికెట్, వాలీబాల్, షెటిల్ తదితర ఆటలు ఆడుతూ సెలవులను ఉత్సాహంగా గడుపుతున్నారు. - పెదవేగి

దాతల ఆశయానికి తూట్లు

- ప్రమాదాలను అరికట్టేందుకు డివైడర్ వద్ద దర్పణం ఏర్పాటు
- తరచూగా దర్పణాన్ని ధ్వంసం చేస్తున్న ఆకతాయిలు
- పోలీసులు చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు



ప్రమాదాలకు నిలయంగా భీమడోలు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే కూడలి ప్రాంతం

భీమడోలు: దాతల ఆశయానికి ఆకతాయిలు తూట్లు పొడుస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతంలో వాటిని నియంత్రించేందుకు ఓ దాత పుటాకార దర్పణం ఏర్పాటు చేయగా ఆకతాయిలు ఆ దర్పణాన్ని తరచూ ధ్వంసం చేస్తూ పైశాచికానందం పొందుతున్నారు. జాతీయ రహదారి భీమడోలు రైల్వే గేటు మీదుగా రాష్ట్రీయ భీమడోలు జంక్షన్‌కు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే కూడలిలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తుండడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. దీంతో ప్రమాదాలను నివారించేందుకు ఓ దాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను గుర్తించేలా డివైడర్ వద్ద పుటాకార దర్పణాన్ని ఏర్పాటు చేశారు. దీనితో రోడ్డు ప్రమాదాలు అదుపులోకి వచ్చాయి. అయితే ఆకతాయిలు ఇప్పటికే ఆ అద్దాన్ని రెండు సార్లు ధ్వంసం చేయగా దాత స్పందించి రెండు సార్లు కొత్త అద్దాన్ని ఏర్పాటు చేశారు. నెల రోజుల కితం మూడోసారి సైతం ఆ అద్దాన్ని ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఇక్కడ సంభవిస్తున్న ప్రమాదాల దృష్ట్యా మరో దర్పణం ఏర్పాటు చేయాలని, అలాగే ఆకతాయిలపై నిఘా పెట్టి పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దారిలో డివైడర్ వద్ద ఏర్పాటు చేసిన దర్పణాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

నేడు గుండుగొలనులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలోని గుండుగొలను సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లకు మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏలూరు ఆపరేషన్లు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. గుండుగొలను గ్రామంలో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ

దెందులూరు: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ ఆదివారం రాత్రి గోపన్నపాలెం, కొవ్వలి గ్రామాల్లో గ్రామస్తులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వేగవరం ఎన్టీఆర్ సెంటర్ నుంచి మూడు కూడళ్ల సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. మృతులకు నివాళులర్పించారు.

రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలి





మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, ఎన్‌సీసీ ఆఫీసర్లు, పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

పెదవేగి : రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో పోలీస్‌శాఖ పనిచేస్తుందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై పినకడిమిలోని డి పాల్ విద్యా సంస్థల విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల తల్లిదండ్రుల ఆశలు కలలుగా మిగిలిపోతాయని, యువత భవిష్యత్ అంధకారమవుతుందని వివరించారు. డ్రగ్స్, మాఫియా ముఠాలను అరికట్టడంలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే తెలియజేయాలని.. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డయల్ 112 నంబర్‌కు కాల్ చేసి గాని, సమీప పోలీస్ స్టేషన్‌కి వెళ్లి గాని సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 19వ (ఎ) బెటాలియన్ ఎన్ఎన్‌సీ, కల్నల్ అమిత్ పాండే, సుబేదార్ ఆదినారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ హబీబ్ బాషా, ఏలూరు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఎన్ఎన్‌సీ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్యసేవలు



గణపవరంలో లయన్స్ నేత్ర వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గణపవరం: లయన్స్ క్లబ్ సేవలు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు అందేలా కార్యక్రమం రూపొందించినట్లు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం గణపవరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వర్తక సంఘ భవనంలో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సీనియర్ లయన్ సభ్యుడు క్రొవ్విడి నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు. 200 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పచ్చిపులుసు నాగేశ్వరరావు, కల్లిగొట్ల విశారద తెలిపారు. లయన్స్ జోన్ చైర్మన్‌లు వెల్లంకి నరేష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతల వేళలివే..

ఉంగుటూరు: నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ అబ్రహమ్ తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించే నిమిత్తం 5 ఎంవీఏ బదులు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా 11 కేవీ ఫీడర్ల పరిధిలోని నారాయణపురంలోని పరిశ్రమలకు, రాచూరు, శీతారామపురం, రావులపర్రు, గ్రామాల్లోని గృహ, చెరువులకు విద్యుత్ ఉండదని డీఈ వివరించారు. వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.



సరిపల్లెలోని ప్రమాదకర మలుపు



రాచూరు రెండు గుళ్లవద్ద పరిస్థితి ఇది



గణపవరం బండిరేవు వద్ద మలుపు ఇలా..



నిడమర్రు సెంటర్‌లో ఎస్ మలుపు..

యమ డేంజర్

- మలుపులు.. ఆదమరిస్తే అంతే సంగతులు
- ప్రమాదకర మలుపుల్లో హెచ్చరిక బోర్డులు కానరాని వైనం



పిప్పర శివారు కనకదుర్గగుడి వద్ద హెచ్చరిక బోర్డులులేని మూడురోడ్ల కూడలి

గణపవరం: గణపవరం ఆర్అండ్‌బీ సెక్షన్ పరిధిలోని పలుచోట్ల ఆర్అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అలాగే ముఖ్యమైన మూడు రోడ్ల కూడళ్లు సైతం వాహనదారుల పాలిట యమగండాలుగా తయారయ్యాయి. గణపవరం నుంచి తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు వైపు వెళ్లే ప్రధాన రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలోను, కొన్నిచోట్ల జెడ్ ఆకారంలో, మరికొన్ని చోట్ల ఎస్ ఆకారంలో అనేక మలుపులు ఉన్నాయి. మరికొన్ని చోట్ల మూడు రోడ్లు కలిసే కూడళ్లు ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారులపై ఉన్న మలుపుల వద్ద వాహనాలు వెంట్రుక వాసిలో ప్రమాదాల బారి నుంచి బయట పడిన సందర్భాలనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగని యంత్రణలు, మార్గసూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

- గణపవరం–తాడేపల్లిగూడెం రహదారిలో గణపవరం సెంటర్‌కు అతి సమీపంలో బండిరేవు వద్ద ఎల్ ఆకారంలో ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతుంటారు.
- ఇక బొబ్బిలి వంతెన దిగువన ఉన్న మూడురోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఏలూరు వైపు, గణపవరం వైపు వెళ్లే వాహనాలు, ఆకివీడువైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపువద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం గగనంగా ఉంటుంది.
- భీమవరం వైపు వెళ్లే రహదారిలో సరిపల్లె వెలంపేటవద్ద, బీసీ కాలనీల వద్ద ఉన్న ఎల్ ఆకారపు మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు.
- బాలయ్య చెర్వువద్ద ఉన్న మలుపు మార్జిన్‌లో వాహనాలు నిలుపుదల చేసి ఉండటం వల్ల ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇక అంతే సంగతులు.
- మండలపర్రు వంతెన వద్ద, నాగనమిల్లి పుంతమునలమ్మ గుడివద్ద, నిడమర్రు హైస్కూలు వద్ద ఉన్న మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. నాగనమిల్లి ఎస్ టర్నింగ్‌లో ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి.
- ఇక అత్యంత ప్రమాదకరమైన మలుపు రాచూరు వద్ద ఉంది, ఎల్ ఆకారంలో ఉండే మలుపులో రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఐదారు అడుగుల సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు.

కూడళ్లు.. ఇక్కట్లు

పిప్పర సెంటర్‌లో తాడేపల్లిగూడెం, భీమవరం, అత్తిలి వైపు వెళ్లే మూడు రోడ్లు కలిసే కూడలి ఎప్పుడూ రద్దీగా ఉంటూ, మూడువైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకే సమయంలో కూడలిలోకి వచ్చి ట్రాఫిక్ నిలిచిపోతుంది. పిప్పర శివారు కనకదుర్గ గుడివద్ద మూడు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా ఉంటుంది. బువ్వనపల్లి సెంటర్‌లో మూడు రోడ్ల కూడలిలో కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిడమర్రు సెంటర్‌లో మూడు రోడ్ల కూడలి కూడా ప్రమాదకరంగా ఉంటుంది.